క్లుప్తంగా

వైభవంగా సత్యదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పాత గుంటూరు: రవీంద్రనగర్‌లోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవస్థానం 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళ వాయిద్య గోష్ఠి, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ చావలి గణపతి, సభ్యులు సీతారామాంజనేయ శర్మ, కామేశ్వరరావు పర్యవేక్షించారు.

మలబార్‌లో విశిష్ట ఆభరణాల ప్రదర్శన ప్రారంభం



పాత గుంటూరు: గుంటూరు లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ – డైమండ్స్ షోరూంలో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యూయలరీలో విశిష్ట ఆభరణాల ప్రదర్శనను శుక్రవారం వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, డాక్టర్ యేలూరి మానస, డాక్టర్ ఈదర ప్రజ్ఞానంజలి, ఆధ్యాత్మికవేత్త పెద్ది రమణరావు ప్రారంభించారు. స్టోర్ హెడ్ నదీర్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6వ తేదీ వరకు షో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22 క్యారెట్ల పాత బంగారం మార్పిడిపై 0% తగ్గింపును వినియోగదారులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్, స్టోర్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన



పొన్నూరు (చేబ్రోలు): పొన్నూరు పట్టణంలో అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణానికి గానూ శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి స్థల పరిశీలన చేశారు. పట్టణంలోని ఆర్టీసీకి చెందిన 0.35 సెంట్ల భూమిని స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం కోసం రూరల్ మండలంలోని వల్లభరావుపాలెంలోని సర్వే నంబర్ 5789లో గల 1.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. జేసీ వెంట తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దారు, ఆర్టీసీ డీఎం, కోర్టు సూపరింటెండెంటు, మండల సర్వేయర్ ఉన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ



అప్పాపురం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరాలని గుడ్ సమ్మర్ రిటర్న్ ఫౌండేషన్ అధ్యక్షుడు దారా నెహేమియా తెలిపారు. మండలంలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నెహేమియా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ఉన్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షహనాజ్ బేగం పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో యూరియా పంపిణీ



కాకుమాను: ఈ ఏడాది రబీ సీజన్‌లో ప్రతి రైతుకీ సకాలంలో యూరియాను అందిస్తామని ఏఓ కె.కిరణ్మయి తెలిపారు. మండలంలోని రేటూరు, కేబీ పాలెం, లింగంగుంటపాలెం గ్రామాలకు శుక్రవారం యూరియా సరఫరా అయ్యింది.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు రబీ సాగుకి సంబంధించి 340 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె చెప్పారు. ఆయా గ్రామాల్లో శనివారం నుంచి రైతులకు యూరియా అందించనున్నట్లు ఏవో పేర్కొన్నారు.

కళాతపస్వికి ప్రముఖుల సంతాపం

పాత గుంటూరు: ఎన్నో అపురూప చిత్రాల్ని అందించిన అగ్ర దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు నగర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, కళా సంస్థల ప్రతినిధులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. ఎన్నో అత్యుత్తమైన చిత్రాల్ని తెరకెక్కించి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు వన్నె తెచ్చిన దిగ్గజ దర్శకుడు దివికేగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వనాథ్‌తో తమకున్న అనుబంధాన్ని తెలియజేశారు. కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు కార్యదర్శి పి. రామచంద్రరాజు, దర్శక నిర్మాత, వీరెళ్ల నాగేశ్వరరావు, శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్, రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ఎస్‌ఎం. సుభాని ఆయనకు నివాళులర్పించారు.

సినీ రంగానికి తీరనిలోటు

తెలుగు సినీ రంగానికి ఆణిముత్యాల్లాంటి చిత్రాల్ని అందించిన దర్శక దిగ్గజం, రచయిత, నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, కళాతపస్వి కె. విశ్వనాథ్ మరణ తెలుగు సినీ రంగానికి తీరని లోటని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విశ్వనాథ్ మృతి బాధాకరం

దర్శకుడు విశ్వనాథ్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. విశ్వనాథ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2015లో నాజ్ సెంటర్‌లోని ఐలాండ్‌లో అల్లూరి విగ్రహావిష్కరణలో పాల్గొన్న విశ్వనాథ్ ఎమ్మెల్యే ముస్తఫాను ఆప్యాయంగా పలకరించారు.



2015లో నాజ్ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన విశ్వనాథ్, పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా

అనంతరం విజ్ఞాన మందిరంలో సత్కరించారు.

గుంటూరు వేదికగా పలుమారుసత్కారం

గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞానమందిరం వేదికగా అగ్ర దర్శకుడు కె. విశ్వనాథ్‌కు ఎన్నో సార్లు సత్కారం జరిగింది. 2004లో నాజ్ సెంటర్‌లోని ఒక హోటల్‌లో స్వరాభిషేకం చిత్ర విజయోత్సవంలో పాల్గొన్న ఆయన్ను ఈవీవీ యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి ఘనంగా సత్కరించారు. 2010లో భాస్కర్ థియేటర్‌లో శుభప్రదం చిత్ర విజయోత్సవంలో విశ్వనాథ్‌ను సత్కరించారు. కళాదర్బార్, దాసరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు పొత్తూరి



విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు



1987లో గుంటూరులో విశ్వనాథ్‌కు అవార్డును అందిస్తున్న పొత్తూరి రంగారావు

రంగారావు ఆధ్వర్యంలో 1983లో అకాడమీ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వనాథ్‌ను సత్కరించారు. 1987లో ఉత్తమ దర్శకుడు అవార్డును అందించి సత్కరించారు. 1993లో సంస్థ వార్షికోత్సవంలో పాల్గొన్నారు.

విశ్వనాథ్‌కు ఘన నివాళి

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో సాహితీ సమాఖ్య ఇలైట్ సర్కిల్ ఆధ్వర్యంలో దర్శకుడు విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ సామాఖ్య కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, వజ్రం పాండురంగారావు, దుర్గాప్రసాద్, ఎస్.శైలజ, కె.శర్వాణి, గుదిమెళ్ల శ్రీకూర్మనాథం, ప్రిన్సిపాల్ రవిబాబు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని 207 వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 82 వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాసుల్ని ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల వివరాలను శనివారం అన్ని వార్డు సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.దరఖాస్తుదారుడు 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు (ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ, 10వ తరగతి సర్టిఫికెట్ లోని పుట్టిన తేదీ ఒకటై ఉండాలి) 31 జనవరి 2023 నాటికి 18 ఏళ్లు నిండి, 35 ఏళ్లు మించని వారై ఉండాలన్నారు. దరఖాస్తుదారుని ఆధార్ కార్డు చిరునామా నగర పాలక సంస్థ పరిధిలోనే ఉండాలని సూచించారు. ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10న పరిశీలన, 14, 15 తేదీల్లో మౌఖిక పరీక్షలు నిర్వహించి అభ్యర్థుల్ని ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఎంపికైన వారంతా ఈ నెల 17 నుంచి విధుల్లో చేరాలని కమిషనర్ సూచించారు.

మరో ఇద్దరు లిక్విడ్ గంజాయి విక్రేతల అరెస్టు

నగరంపాలెం: లిక్విడ్ గంజాయి విక్రయం కేసులో మరో ఇద్దరు యువకుల్ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ గుంటూరు-2 స్టేషన్ సీఐ ఎం.రమేష్ శుక్రవారం తెలిపారు. ఎస్ఈబీ గుంటూరు-2, డీఎస్ఈఓ బృంద పోలీసులు బుధవారం గుంటూరు క్లబ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమయంలో బేల్దారి మేస్త్రీ జె.వెంకటేశ్వర్లును అదే రోజు అరెస్ట్ చేసి, రూ.1.40 లక్షల విలువైన లిక్విడ్ గంజాయి, మోటారు సైకిల్‌ను సీజ్ చేశారని చెప్పారు. ఆ రోజు పరారైన మారుతీనగర్‌కు చెందిన తాజుద్దీన్‌ను గురువారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో అతనితోపాటు అదే ప్రాంతానికి చెందిన శివప్రసాద్‌ను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. ఇంటర్ వరకు చదివి, చెడు వ్యసనాలకు బానిసగా మారి దురాశతో లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం అధ్యయనం

పెదకాకాని: మండలంలోని నంబూరు గ్రామ శివార్లలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల్ని శుక్రవారం 20 మంది ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.ఎస్. సాయినాథ్‌కుమార్ కాలనీలో ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారునికి కావాల్సిన అర్హత, లబ్ధిదారుని ఎంపిక, స్థలం మంజూరు, గృహ నిర్మాణాలు, ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, బ్యాంకుల ద్వారా సహకారం వంటి అంశాల్ని వారికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.వి. మల్లేశ్వరరావు, గృహ నిర్మాణశాఖ ఈఈ



నిర్మాణాలను పరిశీలిస్తున్న ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు, గృహ నిర్మాణశాఖ అధికారులు

వై. భాస్కర్, డీఈ డి.వి.ఎస్. కోటేశ్వరరావు, ఏఈ కె. రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎథికల్ హ్యాకింగ్ సర్టిఫికెట్ల ప్రదానం

గుంటూరు రూరల్: సైబర్ నేరాల్ని నియంత్రించే దిశగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ సూచించారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నార్టన్‌లైఫ్ లాక్ సాంకేతిక పరిశ్రమ సహకారంతో నాస్కం ఫౌండేషన్ ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా టీఎంఐ కన్సల్టెన్సీ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ సెక్యూరిటీలో ఎథికల్ హ్యాకింగ్ అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించి, విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశామని తెలిపారు. ప్రస్తుత సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఎప్పటికప్పుడు విద్యార్థులు అప్‌డేట్ అవ్వాలని ఆయన



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సూచించారు. కార్యక్రమంలో కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం కో–ఆర్డినేటర్ ఎం.వి.పి.చంద్రశేఖర్, సంతోషరావు, నరేంద్రనాథ్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో, డైరెక్టర్ ఎస్.వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల ప్రారంభం

చేబ్రోలు: పశు పోషకుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాడి పరిశ్రమకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. మండలంలోని వడ్లమూడి క్వారీ దేవస్థానం వద్ద శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల్ని ఎమ్మెల్యేతో పాటు తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తదితరులు ప్రారంభించారు. పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని చేబ్రోలు, పెదకాకాని మండలాలకు ఉపయోగపడే విధంగా రెండు వాహనాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం సంచార పశు ఆరోగ్య సేవా వాహనాల్ని అందుబాటులోకి తీసుకు వచ్చిందని చెప్పారు. ఇందులో పశు



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

వైద్యులు, సహాయకులు సేవలు అందిస్తారని తెలిపారు. అవసరమైన చోట్ల హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యంతో పశువులను వాహనంలోకి ఎక్కించి శస్త్ర చికిత్సలు చేసే సౌలభ్యం ఉందని వివరించారు. సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ మాట్లాడుతూ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరక్టర్ జె. వెంకటేశ్వర్లు, పశు వైద్యులు మల్లికార్జునరావు, ఎస్. సుబ్బారెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

5న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీ సాయిరాగ సంగీత కళాశాల ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే విభావరిలో గాయకులు సినీ పాటలను ఆలపిస్తారని, సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నగరంపాలెం: అమరావతి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ టి.ఎస్. రాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ సబ్ డివిజన్ టౌన్–2 పరిధిలోని గోరంట్ల, హోసన్నా మందిర్, అన్నపూర్ణ నగర్‌లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

పట్నంబజారు: ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నూరు రోడ్డులో నివాసం ఉండే పఠాన్ ఫయాజ్‌ఖాన్ రామిరెడ్డితోటలోని బంధువుల నివాసానికి వెళ్లి వచ్చే క్రమంలో అబుఖాన్ పరిచయమయ్యాడు. సచివాలయంలో టౌన్ ప్లానర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి అబుఖాన్ రూ. 50వేలు తీసుకున్నాడు. ఉద్యోగం గురించి ఏమి చెప్పకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయాయని గ్రహించిన ఫయాజ్‌ఖాన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శివారు కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గుంటూరు రూరల్: శివారు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని 48వ డివిజన్ కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సరస్వతి కాలనీలో రూ. 32.20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైన్‌ల పనుల్ని శుక్రవారం పరిశీలించారు.పనుల పురోగతిని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపాలు లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు సంబంధిత వార్డు సచివాలయం సెక్రటరీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఈజీఎస్ కౌన్సిల్ సభ్యుడు ఎల్. మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అధ్యక్షతన ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్ని ఈనెల 16 నుంచి 22 వరకూ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ



చేబ్రోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 66వ రాష్ట్రస్థాయి అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీల్లో మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బత్తుల వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ప్రకాశం జిల్లా దొనకొండలో ఈ నెల జనవరి 23 నుంచి 30వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా జట్టు తరఫున నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు బాలురు, ముగ్గురు బాలికలు పాల్గొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు బాలుర విభాగంలో కె. డేవిడ్‌రాజు, వై. సుధీర్‌కుమార్, బాలికల విభాగంలో ఎస్. అలేఖ్య ఎంపికయ్యారు. విద్యార్థుల్ని ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు అభినందించారు. శిక్షణ ఇచ్చిన బత్తుల వెంకటేశ్వరరావును, విద్యార్థుల్ని హైస్కూలులో సత్కరించారు.

ఎంసీహెచ్ వార్డు నిర్మాణానికి 1968 బ్యాచ్ సహకారం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో 600 పడకలతో నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రానికి (ఎంసీహెచ్) సహాయ సహకారాలు అందిస్తామని గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థుల సంఘం 1968 బ్యాచ్ వైద్యులు ప్రకటించారు. శుక్రవారం ఆ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ బి.వెంకట్, డాక్టర్ నళినాక్షి, డాక్టర్ రామరాజు, డాక్టర్ సులోచన ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనుల్ని పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేందుకు ఆర్థిక చేయూతనందించేందుకు తమ బ్యాచ్ సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, జింఖానా కో– ఆర్డినేటర్ డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పూర్వ వైద్య విద్యార్థులు

టీబీ వ్యాధిగ్రస్తులకు ఐటీసీ విరాళం

గుంటూరు మెడికల్: ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు గుంటూరు ఐటీసీ లిమిటెడ్ రూ. 4.20 లక్షలు విరాళంగా అందజేసినట్లు జిల్లా క్షయ వాధి నివారణ అధికారి డాక్టర్ బి.లక్ష్మానాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె.హనుమంతరావు శుక్రవారం తెలిపారు. జిల్లాలో వంద మంది టీబీ రోగులకు ఒక్కొక్కరికీ నెలకు రూ. 700 చొప్పున ఆరు నెలలకు గాను పోషకాహారం నిమిత్తం ఐటీసీ సంస్థ ఆర్థికసాయం చేసినట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ తరఫున ఐటీసీ లిమిటెడ్ గుంటూరు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని కార్పొరేట్ సంస్థలు, విద్యా సంస్థలు, ఇతర విభాగాలకు చెందిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు సాయం అందించాలని వారు కోరారు.

నేడు, రేపు యేలూరి హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: యేలూరి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని రెండు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధినేత, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ యేలూరి రామకృష్ణ చెప్పారు. స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని హాస్పిటల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. వార్షికోత్సవం పురస్కరించుకుని ఆరోగ్య సంరక్షణ కార్డును అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని ద్వారా కుటుంబంలో ఐదుగురు సభ్యులు తమ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు, ఓపీ ఫీజు, అడ్మిషన్ సమయంలో వైద్యానికి అయ్యే ఖర్చులు 20 శాతం రాయితీతో పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఐసీయూ స్పెషలిస్టు డాక్టర్ ముక్కా మానస, జనరల్ మెడిసిన్ ఫిజీషియన్ డాక్టర్ ఈదర ప్రజ్ఞాంజలి, హాస్పిటల్ సీఈఓ పి.యోహాన్ పాల్గొన్నారు.



హెల్త్ కార్డును ఆవిష్కరిస్తున్న డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మానస, డాక్టర్ ప్రజ్ఞాంజలి

పొత్తూరు తాగునీటి సమస్యకు పరిష్కారం

రూ. 8 లక్షలతో బోరు, వాటర్ పైప్‌లైన్ పనులు ప్రారంభం

గుంటూరు రూరల్: రానున్న వేసవిలో పొత్తూరు గ్రామ ప్రజల తాగునీటి సమస్యల్ని పరిష్కరించేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తెలిపారు. గ్రామంలో శుక్రవారం రూ. 8 లక్షలతో బోర్, వాటర్ పైప్‌లైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహకారంతో డివిజన్ పరిధిలో ఇప్పటికే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైన్‌లు, తాగునీటి పైప్‌లైన్‌లు, బోర్లు తదతర పనులు పూర్తయ్యాయని వివరించారు. కార్యక్రమంలో అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోర్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తదితరులు

ఉద్యోగ నియామకాల్లో వీవీఐటీ విద్యార్థుల సత్తా



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి తదితరులు

పెదకాకాని: బహుళ జాతీయ సంస్థల ఉద్యోగ నియామకాల్లో వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన 50 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. విద్యార్థులు ఉద్యోగ నియామకాలు సాధించిన సందర్భంగా శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ రూ. 8 లక్షల వార్షిక వేతనంతో బహుళ జాతీయ సంస్థ సేల్‌ఫోర్స్‌లో ఐదుగురు, రూ.7 లక్షల వార్షిక వేతనంతో టీసీఎస్ డిజిటల్‌లో తొమ్మిది మంది, రూ. 6.2 లక్షల వార్షిక వేతనంతో 28 మంది, ఎఫెక్ట్రానిక్స్ సంస్థలో రూ. 4 లక్షల వార్షిక వేతనంతో నలుగురు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. 2022–23 విద్యాసంవత్సరానికి గాను ఇప్పటికే 600 మందికి పైగా వివిధ బహుళ జాతీయ సంస్థల్లో నియామకాలు పొందారని వివరించారు. కళాశాలలో ప్రతి విద్యార్థి ఉద్యోగ నియామకాలు అందుకునేలా, పరిశ్రమ అవసరాలకు తగినట్లుగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ ప్లేస్‌మెంట్స్ ఎం.వి. రఘురామ్, డీన్ ఆఫ్ ఎకడమిక్స్ కె. గిరిబాబు, డీన్ ఎడ్మిన్ ఎస్. కుమారస్వామి, ఉపాధి, శిక్షణాధికారి మాధవ్, అధ్యాపకులు అభినందించారు.

జగనన్న మహిళా మార్ట్‌కు భవనం పరిశీలన

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో ఏర్పాటు చేయనున్న జగనన్న మహిళా మార్ట్‌కు అనువైన భవనాన్ని డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్ బాబు శుక్రవారం పరిశీలించారు. వైఎస్సార్ చేయూత పథకం కింద ప్రతి మండలంలో ఒకటి చొప్పున మార్ట్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు రామవాగు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. అనువుగా ఉంటుందని ఏపీఎంకు సూచించి, భవన యజమానులతో మాట్లాడారు. త్వరలోనే మండల కేంద్రంలో మార్ట్‌ను రూ. 25 నుంచి రూ. 40 లక్షలతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట భవన యజమాని షేక్ జిలాని, ఏపీఎం సురేష్ కుమార్ ఉన్నారు.



భవనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ బాబు